క్లుప్తంగా

లీకేజీ సమస్యను పరిష్కరించిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు నగరపాలక సంస్థ యూజీడీ అధికారులు స్పందించారు. మధురానగర్ నేతాజీ కాలనీ బీవీ సుబ్బారావు వీధిలోని యూజీడీ లీకేజీలను శనివారం సరిచేశారు. ఇక్కడ గత నెల రోజులుగా యూజీడీ లీకేజీల వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారటంతో పాటు దుర్వాసన వెదజల్లుతూ ఉంది. దీంతో స్థానికులు పడుతున్న అవస్థలను వివరిస్తూ శనివారం 'సాక్షి'లో 'రోడ్డుపైకి మురుగు' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన యూజీడీ ఏఈ వెంకటేష్ లీకేజీలను సరిచేయించారు. అలాగే సెప్టిక్ ట్యాంకర్ ద్వారా యూజీడీ వ్యర్థాలను తొలగించారు. తమ సమస్యను పరిష్కరించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాథమిక విద్య తెలుగులోనే కొనసాగించాలి

విజయవాడ కల్చరల్: ప్రాథమిక విద్యను తెలుగు మాధ్యమంలోనే కొనసాగించాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందులు ఏపీ విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎన్టీ రామారావు సీఎంగా ఉండగా విధాన ప్రకటన చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో నాలుగు సెమిస్టర్ విధానం అమలు చేయాలని, గ్రామీణ ఉద్యోగాలలో తెలుగు మాధ్యమంలో చదువుకున్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలని, తెలుగును ఒక పాఠ్యాంశంగా చదువుకున్నవారికి 15 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు. వీటితోపాటు హైస్కూల్ విద్యార్థులకు భాషా, సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేలా బాలల పత్రికను నిర్వాహించాలని ఆ ప్రకటనలో కోరారు.

శివకామేశ్వరి అమ్మవారికి సారె సమర్పణ



మధురానగర్ (విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శనివారం మహిళా మండలి మహిళలు, భక్తులు శివకామేశ్వరీ అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారికి ప్రీతికరమైన సారెతో మహిళలు డప్పువాయిద్యాలు, మేళతాళాలతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు సారె స్వీకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

పిచ్చి మొక్కల తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్ అయోధ్యనగర్ లోటస్‌ల్యాండ్ మార్క్‌లో చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ఇటీవల లోటస్ ల్యాండ్ మార్క్, బుడమేరు కట్టమీద చెత్తాచెదారం పేరుకుపోవటంతోపాటు పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో స్థానిక కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు సూచనల మేరకు శనివారం పారిశుద్ధ్య సిబ్బంది జేసీబీతో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించారు.

అర్బన్ మీ సేవ కేంద్రాలను పునఃప్రారంభించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు):గతంలో మూసి వేసిన 170 ప్రభుత్వ అర్బన్ మీ సేవ కాంద్రాలను పునఃప్రారంభించాలని ఏపీ ఇ(మీ) సేవ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ప్రారంభించి జీవో ఎంఎస్ నంబర్ 2 ద్వారా ఇ సేవ వ్యవస్థను గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థకు బదిలీ చేశారని గుర్తు చేశారు. దీంతో గత 19 ఏళ్లగా మీ సేవపై ఆధారపడి జీవిస్తున్న 607 మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి తమ సమస్యలపై వినతి పత్రం ఇచ్చామని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇచ్చిన హామీ మేరకు 170 ప్రభుత్వ అర్బన్ మీ సేవ కేంద్రాలు తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సీఐటీ యూ నగర కార్యదర్శి ఎం.వి.సుధాకర్, ఎం. బాబూరావు, నాగేశ్వరరావు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నగరంలో జోరు వాన...











బెజవాడలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి జోరుగా వర్షం కురిసింది. శనివారం సాయంత్రం వరకూ వర్షం కురుస్తూనే ఉంది. వర్షం వల్ల ఉదయం పూట పనులు, ఉద్యోగాలు, కళాశాలలు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు కొంత అసౌకర్యానికి గురయ్యారు. రెయిన్‌కోట్లు, జాకెట్లు ధరించడంతో పాటు గొడుగులు వేసుకొని ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

యానిమేషన్ రంగంలో ఉపాధి అవకాశాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు):యానిమేషన్ రంగంలో ఉపాధి అవకాశాలు ఉన్నాయని ప్రముఖ చిత్రకారుడు ఎన్.శ్రీధర్ అన్నారు. ఎంజీరోడ్డులోని నలంద డిగ్రీ కళాశాల విజువల్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం ఎక్స్‌ప్రెసివ్ 2డి యానిమేషన్ వర్క్‌షాపు నిర్వహించారు. చిత్రకారుడు శ్రీధర్ విద్యార్థులకు 2డీ యానిమేషన్ మెలకువలు, క్యారెక్టర్ ఆర్ట్, ఎనాటమీ, ఎక్స్‌పెషన్స్ వంటివి నేర్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా రేఖా చిత్రాలు గీసేందుకు ప్రయత్నించారు. ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, విజువల్ కమ్యూనికేషన్ విభాగాధిపతి బి.శ్రీనివాసరావు, ఫిరోజ్‌ఖాన్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.



చేతి వృత్తులను వ్యాపారంగా మార్చుకోవాలి

ఎంఎస్ఎంఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు దాసరి దేవరాజ్



ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన స్కీమ్ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న దాసరి దేవరాజ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన స్కీమ్‌ను సద్వినియోగం చేసుకుని చేతివృత్తులను వ్యాపారంగా మార్చుకుని ఆర్థికంగా స్థిరపడాలని ఎంఎస్ఎంఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు దాసరి దేవరాజ్, ఛాంబర్ డెవలప్‌మెంట్ అధికారి ప్రభ సూచించారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డు సమీపంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యాలయంలో శనివారం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన స్కీమ్‌పై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు కుట్టేవారు, తాపీ, బుట్టలు అల్లేవారు. క్షురకులు, బొమ్మల తయారీదారులు, చేపల వల తయారీ, బట్టలు కుట్టేవారు, బట్టలు ఉతికేవారికి అవసరమైన శిక్షణ ఇవ్వటంతోపాటు రూ.3 లక్షల వరకు రుణసాయం అందించే అవకాశం ఉందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని చేతివృత్తుల వారు వ్యాపార రంగంలో రాణించాలని సూచించారు. ఇందుకుగానూ అవసరమైన సహాయ సహకారం ఎంఎస్ఎంఈ అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సిబ్బంది, పలు ప్రాంతాల నుంచి వచ్చిన చేతి వృత్తుల వారు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై బైండోవర్ కేసుల నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): ఎన్టీఆర్ జిల్లా కుందావారి కండ్రిక గ్రామంలో ఆర్ఎస్ నంబరు 60/2లో భూమి విషయమై రెండు వర్గాల మధ్య ఏర్పడిన వివాదంలో నున్న పోలీసులు ఇరు వర్గాలకు చెందిన 8 మందిపై శనివారం బైండోవర్ కేసు నమోదు చేసి విజయవాడ రూరల్ మండల తహసీల్దార్‌కు పంపారు. నున్న పోలీసు స్టేషన్ సీఐ ఎస్.దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ రూరల్ మండలం కుందావారి కండ్రిక గ్రామం ఆర్ఎస్ నంబరు 60/2లో ఆంధ్ర సిమెంట్ కంపెనీ ఎంప్లాయిస్ అండ్ ఇండస్ట్రియల్ వర్కర్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీగా ఏర్పడి ప్లాట్లుగా విభజించుకున్నారు. ఈ ఖాళీ స్థలాల విషయంలో అశోక్ వర్మ, బండారు వెంకటేశ్వర్లు రెండు వర్గాలకు మధ్య ఏర్పడిన వివాదం కారణంగా రెండు వర్గాలకు చెందిన బండారు వెంకటేశ్వర్లు, బండారు దుర్గారావు, మత్తి శ్రీనివాసరావు తదితరులు, బడుగు తిరుపతిరావు, గవడకట్ల శివరామకృష్ణ, వరస రమేష్ బాబు, చింతా శ్రీనివాసరావు, గొడవర్తి అశోక్‌వర్మ తదితరులపై బైండోవర్ కేసు నమోదు చేసి రూరల్ మండల తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్టు తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు



నృత్యం చేస్తున్న కళాకారిణులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ప్రాంగణంలోని కళావేదికపై కళాకారిణులు తమ కూచిపూడి నృత్యాలతో భక్తులను అలరించారు. ప్రతి రోజు నిర్వహించే ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం విశాఖపట్నానికి చెందిన నాట్య ఝురి సంగీత నృత్యాలయ ఆధ్వర్యంలో నాట్యాచారిణి సాహితి రవళి నేతృత్వంలో వినాయక కౌతం, ఎందరో మహానుభావులు..కొందరికే వందనములు, బ్రహ్మాంజలి..తాండవ నృత్యకేళి , అఖిలాండేశ్వరీ..చాముండేశ్వరి, శివాష్టకం, శివతాండవం, శివ స్తుతి, అదివో అల్లదిఒ శ్రీహరివాసమూ, జగదానందకారక..జయ జానకి ప్రాణ నాయక, రాజరాజేశ్వరి అష్టకం అంశాలకు పలువురు నర్తకీమణులు నర్తించారు. ఆయా అంశాలకు తగ్గట్లు చక్కని హావభావాలు, ఆహార్యం, అభినయంతో ప్రదర్శించిన సంప్రదాయ కూచిపూడి నృత్యాలు భక్తులను తన్మయులను చేశాయి.

వీఎంసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



డ్రెయిన్‌లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ మహేష్

పటమట(విజయవాడతూర్పు):వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటూ ఎయిర్‌టెక్ యంత్రాలతో రోడ్లను నిరంతరం శుభ్రం చేస్తుండాలని వీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎ.మహేష్ కార్యాలయ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని బెంజిసర్కిల్, గురునానక్ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాల్లో శనివారం ఉదయం ఆయన పర్యటించి ఆయా ప్రాంతాలకు చెందిన అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్‌లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు, జోనల్ కమిషనర్‌లకు పారిశుద్ధ్యంపై దిశానిర్దేశం చేశారు. వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా రోడ్ల వెంబడి ఉన్న డ్రెయిన్‌లను ఎప్పటికపుడు శుభ్రపర్చాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా ప్రతి సర్కిల్‌లో పొంగుతున్న మురుగును, అండర్ గ్రౌండ్ డ్రెయిన్ నిల్వలను శుభ్రం చేయాలన్నారు. అనంతరం బందరు కాలువ మేజర్ ఔట్ ఫాల్ డ్రెయిన్, మహానాడు రోడ్డు మేజర్ ఔట్ ఫాల్ డ్రెయిన్, మహానాడు రోడ్ ఎస్. ఏ. సి ఫంక్షన్ హాల్ దగ్గరున్న రైవస్ కాలువ మేజర్ ఔట్ ఫాల్ డ్రెయిన్ ఎండింగ్ పాయింట్‌లను చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర రావుతో కలిసి పరిశీలించారు. నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటకం ఉండకుండా అందులో ఉన్న వ్యర్థాలన్నీ తొలగించి వర్షపు నీరు సజావుగా వెళ్లేటట్టు చూడాలని ఆదేశాలు ఇచ్చారు. మూడు సర్కిళ్ల అధికారులు సమన్వయం చేసుకుంటూ చిట్ట చివరి ప్రాంతం వరకు పూడికలన్నీ తీసివేయాలని తెలిపారు.

21న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

విజయవాడ కల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో 21వ తేదీ ఆదివారం ఉదయం సత్యనారాయణపురంలోని సీతారామాకల్యాణ మండపంలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ బీవీ గురునాథశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ వివాహం కోరేవారు, వివాహం కాని వారు పరిచయ వేదికలో పాల్గొనవచ్చని, పేర్లు నమోదుకు యడ్లపాటి శిరీష 83748 52222, 88862 1 6226 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలేరమ్మకు అన్నాభిషేకం



భవానీపురం (విజయవాడపశ్చిమ):స్థానిక ఊర్మిళా సుబ్బారావు గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్ల ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం అమ్మవారికి అన్నాభిషేకం చేశారు. వేకువజామున 5 గంటల నుంచి 7 గంటల వరకు కుంభాభిషేకం, ఉదయం 8 గంటల నుంచి 9 గంటల మధ్య అన్నాభిషేకం, అనంతరం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. తరువాత కుంకుమ పూజ కార్యక్రమం జరిగింది. సాయంత్రం 7 గంటల నుంచి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం పాలకవర్గం అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి మాట్లాడుతూ పోలేరమ్మ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని తెలిపారు. చివరి రోజు ఆదివారం ఉదయం 7 గంటలలోపు ముత్తయిదువులు, కన్యలు కలిసి కృష్ణానదికి వెళ్లి తీసుకువచ్చే జలంతో పోలేరమ్మ అమ్మవారికి కుంభాభిషేకం, అనంతరం పంచామృతాలతో అభిషేకరం, అమ్మవారికి అలంకరణ, మధ్యాహ్నం 12 గంటలకు పొంగలి నివేదన జరుగుతాయని వివరించారు. సాయంత్రం 6 గంటల నుంచి పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు, అనంతరం తీర్థప్రసాదాల వితరణ ఉంటుందని తెలిపారు.

27 నుంచి ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు):ఈ నెల 27వ తేదీ నుంచి రెండు రోజుల పాటు ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా ప్లీనరీ సమావేశాలను మైలవరంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం విద్యార్థుల సమస్యలపై చర్చించి భవిష్యత్ ప్రణాళిక ప్రకటిస్తామన్నారు. సిలబస్ మార్పుల వలన 9, 10 తరగతుల్లో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ హాస్టళ్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి టి.కుమారస్వామి, నాయకులు అవినాష్, షణ్ముక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుధీర్‌పాల్‌రెడ్డి సేవలు అభినందనీయం



లయన్స్ జిల్లా రీజియన్ చైర్‌పర్సన్ సుధీర్‌పాల్‌రెడ్డిని సత్కరిస్తున్న కొల్లూరి తదితరులు

మధురానగర్ (విజయవాడసెంట్రల్): లయన్స్ క్లబ్ జిల్లా రీజియన్ చైర్‌పర్సన్‌గా, విజయవాడ లయన్స్ క్లబ్ ఆఫ్ మెగాసిటీ సభ్యుడిగా సుధీర్‌పాల్‌రెడ్డి అందిస్తున్న సేవలు నిరుపమానం అని లయన్స్‌క్లబ్ ఆఫీసర్స్ అడ్వైజర్ కొల్లూరి కొనియాడారు. స్థానిక సీతారాంపురంలో శనివారం లయన్స్ జిల్లా రీజియన్ చైర్‌పర్సన్ సుధీర్‌పాల్‌రెడ్డి అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొల్లూరి మాట్లాడుతూ పేద ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా సేవలు అందిస్తున్న సుధీర్‌పాల్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అంధత్వ నివారణ, పార్యావరణ పరిరక్షణ, ఉచిత వైద్య శిబిరాలు తదితర సేవల్లో లయన్స్‌క్లబ్ కృషి అభినందనీయమన్నారు. అనంతరం సుధీర్‌పాల్‌రెడ్డిని శాలువా, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ నాయకులు గుండపు చంద్రశేఖర్, అంజలి క్లబ్ కార్యదర్శి డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, బచ్చు సూర్యప్రకాశరావు తదితరులు సుధీర్‌పాల్ రెడ్డిని అభినందించారు.

కల్యాణ వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు రంగాచార్యులు స్వామివారికి విశేషంగా తులసి పూజ, అర్చనలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

17న తొలి ఏకాదశి పూజలు

ఈనెల 17వ తేదీ బుధవారం తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి తెలిపారు. ఆ రోజు విశేషంగా స్వామివారికి లక్ష తులసి పూజ, అభిషేకాలు జరుగుతాయన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రాయల్ క్లబ్స్ సేవలు అభినందనీయం

మంత్రి నారాయణ



మంత్రి నారాయణను సత్కరిస్తున్న రాయల్ క్లబ్స్ అసోసియేషన్ సభ్యులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదువుకునేందుకు రాయల్ క్లబ్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ అన్నారు. నగరంలోని మంత్రి కార్యాలయంలో రాయల్ క్లబ్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని శనివారం కలిసి క్లబ్ తరపున చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. చదువునకు పేదరికం అడ్డుకాకూడదని తమ క్లబ్ తరుపున ఏటా విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామని రాయల్ క్లబ్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సుంకర కృష్ణ మంత్రికి తెలిపారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు ప్రత్యేకంగా తమ అసోసియేషన్ తరపున హాస్టల్‌ను కూడా నిర్మాణం చేయనున్నామని వివరించారు. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారిని ఏటా పురస్కారాలు సైతం అందచేస్తున్నామని చెప్పారు. మంత్రి నారాయణ స్పందిస్తూ అసోసియేషన్ తరుపున చేస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రభుత్వం తరుపున నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. రాయల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ పేటేటి పులయ్య, సభ్యులు గురుకుల పుల్లయ్య, యర్రంశెట్టి శివరామకృష్ణ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

డ్రెయినేజీల్లో సిల్టు తొలగింపు



61వ డివిజన్లో డ్రెయినేజీలో సిల్టు తీస్తున్న సిబ్బంది

పాయకాపురం(విజయవాడరూరల్): వర్షం రాకతో పలు డివిజన్లలో పారిశుద్ధ్య కార్మికులు డ్రెయినేజీల్లో వ్యర్థాలు తొలగింపు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి 61, 62, 63, 64 డివిజన్లలో పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు నిలబడి ప్రజల రాకపోకలకు ఇబ్బంది గురిచేసింది. దీంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పారిశుద్ధ్య కార్మికులతో ఆయా ప్రాంతాల్లో డ్రెయినేజీలో వ్యర్థాలను తొలగించి మురుగు నీరు కాల్వల్లో నిలబడకుండా చర్యలు తీసుకున్నారు. నిలబడిన వర్షం నీరు వలన దోమలు ఉధృతి కాకుండా ఉండేందుకు డ్రెయినేజీల్లోకి పంపారు. శాంతినగర్, ప్రశాంతినగర్, పాయకాపురం, కండ్రిక, రాజీవ్‌నగర్, ఉడాకాలనీల్లో మురుగు నీరు పారుదల అయ్యే విధంగా పనులు చేశారు. ప్రకాష్‌నగర్లో డయేరియా లక్షణాలు గల వారు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స కోసం వచ్చినట్టు వైద్య సిబ్బంది తెలియజేశారు. ఆ ప్రాంతంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి, చల్లార్చిన నీరు తాగాలని డాక్టర్ కె.రాజా ప్రజలకు సూచించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు.

జై జగన్నాథస్వామి..



జగన్నాథస్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



నృత్యాలు ప్రదర్శిస్తున్న మహిళలు

విజయవాడ 16వ డివిజన్‌లో ఇస్కాన్ మందిరంలోని జగన్నాథస్వామిని అధిక సంఖ్యలో భక్తులు శనివారం దర్శించుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులందరికీ మందిర నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం రష్యా, ఉక్రెయిన్ దేశానికి చెందిన భక్తులు ప్రత్యేకంగా ఆలపించిన కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. 200 రకాల పిండి వంటలను స్వామివారికి అర్పించారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు చక్రధారిదాస్ వేణుధారిదాస్, బలరామ గోవిందదాస్, పీఆర్ఓ శ్యాంసుందర అచ్యుతదాస్ పాల్గొన్నారు.
– ఆటోనగర్(విజయవాడతూర్పు)

విద్యుత్ వైరు చోరీ

పాయకాపురం(విజయవాడ రూరల్): నున్న గ్రామం టీచర్స్ కాలనీలో ఇంటి వద్ద పెట్టిన కరెంటు వైరు కట్టలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..నున్న గ్రామం టీచర్స్ కాలనీలో కాటూరి నాగరాజుకు చెందిన 11 కరెంటు వైరు కట్టలు ఈ నెల 10వ తేదీన ఇంటి వద్ద ఉంచారు. 11వ తేదీ ఉదయం చూడగా వైరు కట్టలు కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని, నాగరాజు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.